
# మాతృదేవోభవ



ఆఫీసు సిబ్బంది కంప్యూటర్లమీద హడావుడిగా పనిచేసుకుంటున్నారు. టైపు మిషనులు టపటప ధ్వనులు చేస్తున్నాయి.

ఇంతలో "సార్, మీకు టెలిగ్రామ్!" అంటూ టెలిగ్రామ్ తెచ్చాడు మెసెంజరు. ఆఫీసు టెలిగ్రాములైతే ఆందోళన లేదు. అవి రోజూ వస్తూనే ఉంటాయి. పర్సనల్ టెలిగ్రాములైతేనే ఆందోళన! ఎవరికి సీరియస్‌గా ఉందో? ఎవరు టపా కట్టేశారో? పరిపరి విధాల మనసు పరుగులు!

ఆఫీసు గుమాస్తా రఘువంశికి వచ్చిన టెలిగ్రామ్ అది. "యు ఆర్ బ్లెస్డ్ విత్ ఎ సన్ కంగ్రాట్స్!"

రఘువంశి ఆనందం అర్ణవమైంది. ట్రిపుల్ ఏంటిజెన్ ఇంజెక్షన్లకీ, పాలడబ్బాలకీ, కేజీ బరువులేని కుర్రాడు ఎల్‌కేజీ చదువుతూ, కేజీలకొద్దీ బరువున్న పుస్తకాల్ని మోసే కాన్వెంట్ చదువులకీ, డబ్బు అయితే అయింది. అన్నింటినీ మించి నేటి మార్కెట్ వాల్యూ ప్రకారం లక్షణంగా లక్ష రూపాయల కొడుకు కలిగినందుకు ఆనందించడూ?

లంచవర్లో "సోదర సోదరీమణులారా! ఒక ముఖ్య ప్రకటన! నాకిప్పుడే టెలిగ్రామ్ వచ్చింది. మా శ్రీమతి 'మాతృదేవోభవ' అయినట్లూ, నేను 'పితృదేవోభవ' అయినట్లూను. మీ కివాళే టీపార్టీ ఇస్తున్నాను. నా ఆహ్వానాన్ని మన్నించి, ఈ అల్పుడిచ్చే అల్పాహారపు విందుని ఆరగింపప్రార్థన!" అన్నాడు రఘువంశి. అల్పుడనే మాట వినయంగా కాకుండా గర్వంగా అన్నాడు. వినయంలోనే అహంకారం!

"ఇంతకీ మగపిల్లాడో ఆడపిల్లో చెప్పేవు కావు, గురూ!" అన్నాడో సహోద్యోగి.

"టీ పార్టీ అంటేనే తెలిసిపోతోంది మగపిల్లాడని. ఆడపిల్లయితే పార్టీ ఇస్తాడటయ్యా వెర్రి మొహమా?" అన్నాడింకో ఉద్యోగి.

"ఏం, ఆడపిల్లయితే మాత్రం కష్టపడకుండా ఊరికే పుడుతుందా? ఆడపిల్ల పుట్టినా ఫాలనేత్రంగాడు పార్టీ ఇవ్వలేదా?"

"ఇంతకీ అందరూ పార్టీలిస్తున్నారు గానీ, ఒక్కడే ఒక్కడు, అర్జునరావు మాత్రం ఇప్పటికీ పార్టీ ఇవ్వలేదు. పదేళ్లనుంచి ఎదురు చూస్తున్నాం, నోరు తీపి చేస్తాడేమో అని."

"పాపం, అర్జునరావు ఏమి చేస్తాడయ్యా ... బృహన్నలగాడు!"

"బృహన్నలగాడా? బృహన్నల అంటే ఒక సంవత్సరమే అజ్ఞాతవాసం. కానీ మన ఆధునిక అర్జునుడు పర్మెనంట్ నపుం... పోనీలే, ఎందుకు... ఏడుస్తాడు!" జాలితలిచాడింకో మిత్రుడు ఓ పక్క దెప్పుతూ.

అర్జునరావు కుమిలిపోయాడు. కోపంగా ఇంటికెళ్లి తన సొంత తమ్ముడు, ప్రముఖ గైనకాలజిస్టు అయిన వ్యాసమూర్తిని పిలిచి అన్నిరకాల పరీక్షలు చేయించాడు.

గ్రీకు చక్రవర్తి హైరోకి బంగారు కిరీటం చేయించారు. ఆ బంగారంలో కల్తీ ఉన్నట్లు ఆర్కిమిడిస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఆ కల్తీ కనుగొన్న ఆనందంతో 'యురేకా' అని అరిచాడట. అంటే 'నేనో గొప్ప విషయం కనుగొన్నాను' అని అర్థం.

మరో ఏడాదిలో అర్జునరావు ఎగిరి గంతులు వేస్తూ ఫ్రెండ్సందరి మధ్యా నిలబడి "యురేకా!" అని అరిచాడు.

'వీడికేమైంది చెప్మా?' అన్నట్టు అందరూ వింతగా చూశారు.

"డియర్ ఫ్రెండ్స్! హియరీజ్ ఏన్ ఇంపార్టెంట్ ఎనౌన్స్‌మెంట్!" అన్నాడు. ఇండియన్ ఎయిర్‌లైన్స్‌వారు ఎనౌన్స్ చేసినట్లు.

"ఇదేమిట్రోయ్... పదేళ్లనుంచీ లేని ఎనౌన్స్‌మెంట్ ఇవాళ చేస్తున్నాడు?" అంటూ

అందరూ చెవులు రిక్కించి విన్నారు.

"నా శ్రీమతి అంజలి ఒక ఆడశిశువును ప్రసవించింది. ఇరవయ్యొకటో రోజు పేరంటాళ్లందరినీ పిలిచి ఉయ్యాలలో వేస్తున్నాం. మూడో నెలలో బారసాల!" అన్నాడు అర్జునరావు మీసంలేని మీసం మీద చెయ్యి వేసి. అజ్ఞాతంలోని అర్జునుడిక్కూడా మీసం లేదు కదా!

అర్జునరావుని దెప్పిన వాళ్లందరూ బోర్లాపడ్డారు! జానపద సినిమాల్లో రాజుగారు చప్పట్లు కొడితే, తెరచాటునుండి వచ్చే భటుల్లాగా అర్జునరావు చప్పట్లు కొట్టగానే, ఓ పాతిక స్వీట్స్ ప్లస్ మిక్చర్ పొట్లాలు, మాంఛి బ్రూ కాఫీ ఓ కేన్ నిండా తెచ్చారు కాటరింగ్ కాంట్రాక్టర్స్.

అందరూ స్వీట్లు తిన్నారని పేరేగానీ, అర్జునరావు కొట్టిన ఎదురుదెబ్బకి ఆ స్వీట్లన్నీ 'చేదు'గా ఉన్నాయి.

ఇది కాక అర్జునరావు, తన పాపని ఉయ్యాలలో వేసినప్పుడు, కేవలం తన వీధిలో ఉన్న పేరంటాండ్రని కాక, ఆఫీసులో ఉన్న ఉద్యోగినులనూ పిలిచి, వారికి సెనగలు, అరటిపండు, తాంబూలం, ఒక స్టీలు ప్లేటు ఒక కేరీబాగ్‌లో పెట్టి ఒక్కొక్కరికీ పంపకం చేయించాడు. అలా బహుమతులిచ్చి బహు'మతులు' పోగొట్టాడు.

మూడో నెల బారసాలనాడు అశేష బంధుమిత్ర సందోహాన్ని ఆహ్వానించి విందు చేశాడు.

ఈ రెండు సందర్భాల్లోనూ అర్జునరావు అర్ధాంగి అంజలి, బిక్కమొహం వేసి బితుకు బితుకుమంటూ భర్త మొహం చూడలేకపోయింది. తానేదో ఘోరమైన తప్పిదం చేసినట్లు మథనపడ సాగింది. అర్జునరావు అంజలికి ధైర్యం చెప్పాడు.

"అంజలీ! నువ్వు చేసినది ఉభయులకూ ఎంతో మేలు చేకూర్చింది. ఆఫీసులో నా సహచరులు నన్ను 'బృహన్నల' అనీ, 'షండుడ'నీ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ విమర్శిస్తున్నా మింగలేక కక్కలేక కుమిలి కుమిలి చస్తున్నాను. అందుక్కారణం, పదేళ్లైనా నేను తండ్రిని కాలేకపోవడం ఒక విధంగా నీకూ మానసిక క్షోభే! పదేళ్లయినా మాతృమూర్తివి కాలేకపోయానే అనే దిగులు నీకు మాత్రం లేదూ? ఇప్పుడా మచ్చ మాసిపోయింది. నలుగురు తల్లుల్లాగా నువ్వు కూడా ఒక తల్లివయ్యావనే సంతృప్తి, సమాజంలో ఒక మాతృమూర్తిగా ఒక సమున్నత స్థానం సంపాదించావ్! 'మాతృదేవోభవ' అని ముందు స్త్రీనే తలుస్తారు. 'మాతృభాష' అంటారు. 'మాతృదేశం' అంటారు. ఇలాంటి ఉత్కృష్టమైన తియ్యటి మాట అనిపించుకునే అదృష్టం చాలామంది తల్లులతోపాటు నీకూ దక్కింది.

"ఇహ నా మాట అంటావా? నే నొక మగతనంలేనివానిగా ముద్రపడిపోయింది. నువ్వు పాపని కనడం వల్ల నాకు సమాజంలో తలెత్తుకుని తిరిగే అవకాశం కలిగించావు. నేటి సభ్యసమాజంలో నేనొక 'మగ'వాణ్ణి! నువ్వొక మాతృమూర్తివి. ఈ దెబ్బతో మా ఆఫీసు సిబ్బంది నోళ్లు 'బేండ్ ఎయిడ్'తో నేను మూయించేస్తే, అమ్మలక్కల నోళ్లకు నువ్వు 'ఫెవికాల్' అంటించేశావ్! టెస్ట్‌ట్యూబు బేబీలకు తల్లిదండ్రులయిన వాళ్లు తాము ఎవరివల్ల తల్లిదండ్రులయినదీ తెలియకపోవడం వల్ల వాళ్లు సహజంగానే మాతృత్వ, పితృత్వ మధురిమ పొందుతున్నారు. అలాగే మనమూనూ! ఇదేమీ శాస్త్ర విరుద్ధమూ, ప్రకృతి విరుద్ధమూ కాదు!" ■

